# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. పీఎం కిసాన్ 17వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో విడుదల చేయనున్నారు.**

**2. గత ప్రభుత్వ అసంబద్ధ విధానాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పరిస్థితి సంక్లిష్టంగా మారిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**3. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

**4. తెలంగాణలో 28 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

**5. గిరిజన ప్రాంతాల్లోని 543 ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు కొత్తగా ఏఎన్ఎంలను నియమిస్తామని ఆంధ్రప్రదేశ్ గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.**

**6. ఆటిజం వ్యాధి కాదని.. ఒక రుగ్మత మాత్రమే అని తెలియజేసే లక్ష్యంతో ఈరోజు ఆటిస్టిక్ ప్రైడ్ డేను నిర్వహిస్తున్నారు.**

==========================

పీఎం కిసాన్ 17వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో విడుదల చేయనున్నారు. ఈ పథకం ద్వారా మొత్తం 9 కోట్ల 26 లక్షల మంది రైతుల ఖాతాల్లో 20 వేల కోట్ల రూపాయలు జమ కానున్నాయి. అదే విధంగా పారా ఎక్స్‌టెన్షన్ వర్కర్లుగా పని చేసేందుకు శిక్షణ పొందిన 30వేల మందికిపైగా స్వయం సహాయ బృందాల మహిళలకు ప్రధానమంత్రి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నారు. దేశవ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన కేంద్రాలు, లక్షకుపైగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 5 లక్షల ఉమ్మడి సేవా కేంద్రాలతోసహా 2.5 కోట్ల మంది రైతులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ తెలిపింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు అనేక సంక్షోభాలను ఎదుర్కొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారి

నిన్న పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పిల్‌వే, కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనుల పురోగతి వివరాలను జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఆటంకాలు రాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర విభజనలో భాగంగా తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసేలా ఆనాడు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించానని తెలిపారు. జాతీయ ప్రాజెక్టుగా విభజన చట్టంలో చేర్చడంతో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే 72 శాతం ప్రాజెక్టును పూర్తి చేశామని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విశాఖపట్నంలో నిన్న ఆమె పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. గంజాయి రవాణా నిరోధానికి చెక్‌పోస్టుల సంఖ్యను పెంచుతామని, కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గంజాయి గురించి సమాచారమిచ్చిన వారికి నగదు ప్రోత్సాహకం అందిస్తామని, ప్రత్యేక రుసుము రహిత నంబరును ప్రకటిస్తామని మంత్రి పేర్కొన్నారు. గంజాయి నివారణకు ప్రజా సహకారం కూడా కావాలని... ప్రజలకు మంచి చేసే దృక్పథంతో పోలీసులు ఉండాలని కోరారు.

---------------------------

తెలంగాణలో 28 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలు జిల్లాల పోలీసు సూపరింటెండెంట్‌లతో పాటు ఆ స్థాయి అధికారులను బదిలీ చేసింది. ఇటీవల పలు జిల్లాల కలెక్టర్లను బదిలీ చేసిన ప్రభుత్వం.. తాజాగా ఎస్పీలను బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

గిరిజన ప్రాంతాల్లోని 543 ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు కొత్తగా ఏఎన్ఎంలను నియమిస్తామని ఆంధ్రప్రదేశ్ గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రకటించారు. గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో నిన్న ఆమె మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యాన్ని ఏఎన్ఎంలు నిరంతరం పర్యవేక్షిస్తారని, నెలకోసారి వైద్యుడు వెళ్లి పరీక్షించి హెల్త్ కార్డులు రూపొందిస్తారని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకం, అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పౌష్టికాహారం పంపిణీపై మంత్రి తొలి సంతకం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఈ ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. ఈ పరీక్షలకు దాదాపు లక్షా 40 వేల మంది హాజరయ్యారు. ఇంటర్ మొదటి ఏడాది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఈ నెల 26వ తేదీన విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

---------------------------

ఆటిస్టిక్ ప్రైడ్ డే ప్రతి సంవత్సరం జూన్ 18వ తేదీన జరుపుకొనే వేడుక.. ఇది ఆటిస్టిక్ వ్యక్తులకు గర్వకారణమైన వేదిక. ఆటిస్టిక్ వ్యక్తుల ప్రాముఖ్యతను గుర్తిస్తూ.. సమాజంలో వారి పట్ల సానుకూల దృక్పథాన్ని తీసుకు రావడమే ఈ వేడుక లక్ష్యం. ఆటిజం అనేది ఒక వ్యాధి కాదని.. అది ఒక రుగ్మత మాత్రమే అన్న

విషయాన్ని సమాజానికి తెలియపరచడం కోసం ప్రత్యేకంగా ఈ రోజును ఆటిస్టిక్ ప్రైడ్ డేగా నిర్వహిస్తున్నారు. ఆటిస్టిక్ ప్రైడ్ డేను మొదటిసారిగా 2005లో యాస్పైస్ ఫర్ ఫ్రీడమ్ అనే సంస్థ బ్రెజిల్ లో ప్రారంభించింది. ఆటిజం గురించిన అపోహలు తొలగించడమే లక్ష్యంగా ఈ రోజు పలు కార్యక్రమాలు చేపడతారు. ఆటిజం గురించి సమాచారాన్ని అందరికీ తెలియచేసే విధంగా కార్యశాలలు, సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం ఆటిస్టిక్ ప్రైడ్ డేను ముసుగు తొలగిద్దాం అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారం అవుతుంది.

---------------------------

కేంద్ర మంత్రి హోదాలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువస్తానని.. అదే విధంగా శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటానని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కేంద్ర మంత్రి హోదాలో తొలిసారి శ్రీకాకుళం వచ్చిన ఆయన జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. వరసగా మూడు సార్లు ఎంపీగా గెలిపించిన శ్రీకాకుళం జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఉపాధి కల్పన, వలసల నివారణకు తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

---------------------------

నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకి 15 రోజులు దాటినా.. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత కొనసాగుతోంది. నిన్న తుని, నరసాపురంతో పాటు ఉత్తరాంధ్రలో పలు చోట్ల వడగాలులు వీచాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా తునిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 40.2 డిగ్రీలుగా నమోదైంది. మరోవైపు గోవా నుంచి దక్షిణ కోస్తా వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఈ రోజు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. శ్రీకాకుళం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడొచ్చని వివరించింది. పిడుగులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించింది.

---------------------------

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో నిన్న ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. బలమైన గాలుల ధాటికి కొన్ని చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. అనేక ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఈ నెల 24వ తేదీన 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు విడుదల చేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. సెప్టెంబర్ నెలకు

సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ ఆర్జిత సేవా టికెట్లు ఈ ఉదయం 10 గంటలకు టిటిడి విడుదల చేయనుంది. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు టికెట్ల నమోదుకు అవకాశం ఉంది. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవాటికెట్లను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు అందుబాటులో ఉంచుతారు.

---------------------------

కృష్ణా నదీజలాల నిర్వహణ బోర్డు–కేఆర్‌ఎంబీ ఛైర్మన్ అశోక్‌గోయల్ నాగార్జునసాగర్ ఆనకట్టను పరిశీలించారు. కేఆర్‌ఎంబీ ఛైర్మన్‌గా నూతనంగా నియమితులైన ఆయన కృష్ణా పరీవాహక ప్రాంతంలోని భారీ ప్రాజెక్టులను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా అశోక్‌గోయల్ నిన్న నాగార్జున సాగర్ ప్రధాన డ్యాంతోపాటు క్రస్టుగేట్లు, గ్యాలరీలు, కుడి, ఎడమ కాల్వలు, ప్రధాన విద్యుత్తు కేంద్రాలను పరిశీలించి పలు వివరాలు సేకరించారు. అనంతరం జెన్‌కో విద్యుత్తు కేంద్రంలో అధికారులతో సమావేశమై ఎన్‌ఎస్పీ, ప్రధాన విద్యుత్తు కేంద్రం గురించి చర్చించారు.

======================